సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లో శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. 8లో



రక్తదానంతో ప్రాణదానం

రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పాడేరు ఎంపీడీవో సాయినవీన్ కోరారు. 8లో



రవిబాబు ఎంపికపై హర్షం

గవర్నర్ కేటగిరీలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా కుంభా రవిబాబు పేరును సిఫార్సు చేయడం పై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. 9లో

న్యూస్‌రీల్

సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం రేపు

పాడేరు రూరల్: సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 22న ఉదయం 11 గంటలకు పాడేరు ఎస్‌ఈబీ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎ.సంతోష్ తెలిపారు. నాలుగు బజాజ్ ఆటోలు, బజాజ్ చేతక్ స్కూటర్, టీవీఎస్ స్కూటీ, హీరోహోండా ఫ్యాషన్ బైక్, హీరోహోండా సీబీజెడ్ వాహనాలకు వేలం వేస్తామని ఆయన వివరించారు. ఆసక్తి గల వారు తమ ఆధార్ కార్డుతో పాటు రూ.5 వేలు (వాపసు చేయబడే) చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. పాట ఖరారైన వ్యక్తి వెంటనే వేలం సొమ్మును జీఎస్టీతో కలిపి అదేరోజు చెల్లించాలని ఆయన సూచించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో డ్రైవర్ మృతి



నాగేశ్వరరావు మృతదేహం

చింతూరు: మండలంలోని చిడుమూరు వద్ద సోమవారం ట్రాక్టర్ బోల్తా ఘటనలో తెలంగాణలోని సారపాకకు చెందిన సున్నం నాగేశ్వరరావు (45) అనే వ్యక్తి మృతిచెందాడు. జామాయిల్ కర్ర తెచ్చేందుకు సారపాక నుంచి ఒడిశాలోని పాడియా వెళ్తున్న క్రమంలో చిడుమూరు వద్ద ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ వెనుకభాగం తిరగబడింది. దీంతో ట్రాక్టర్ పైనుంచి కింద పడిన నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని సమీపంలోని ఛత్తీస్‌గఢ్‌లోని కుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో అక్కడ చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు భోజన ప్యాకెట్ల పంపిణీ



భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న పోలీసులు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. వారపు సంతకు, వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన 190 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంటు ఎంఎంల నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



రోడ్డు పక్కన నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

మారేడుమిల్లి: మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో సోమవారం ఓ ఆర్టీసీ బస్సుకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. కాకినాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కాకినాడ నుంచి భద్రాచలం ప్రయాణికులతో వెళ్తోంది. బస్సులో సాంకేతిక లోపం తలెత్తడంతో ఒక్కసారిగా బ్రేక్స్ ఫెయిల్ అయ్యాయి. ఘాట్ రోడ్డులోని దుర్గమ్మ ఆలయం వద్దకు వచ్చేసరికి బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న తుప్పలోకి దూసుకుపోయి నిలిచింది. అదే సమయంలో బస్సులో సుమారు 40 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తుప్పలు అడ్డుగా ఉన్నందున బస్సు నిలిచిపోయిందని, లేకపోతే ఎదురుగా ఉన్న లోయలో పడి పెనూ ప్రమాదం సంభవించేదని ప్రయాణికులు తెలిపారు.

వ్యక్తికి గాయాలు

పెదబయలు: పన్నెడ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు అంచు దిగడంతో బైక్ అదుపుతప్పడంతో తునికి చెందిన అనపర్తి విజయ్‌కుమార్ (30) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. తునికి చెందిన అనపర్తి విజయ్‌కుమార్ ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. సోమవారం పెదబయలు వారపు సంతకు వచ్చి తిరిగి వెళ్తుండగా పన్నెడ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో రోడ్డు అంచు దిగగా బైక్ స్కిడ్ అయ్యి తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రయివేటు వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది. విజయ్‌కుమార్ మద్యం సేవించి డ్రైవింగ్ చేసినట్టు గుర్తించామని, కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

విశ్వసనీయత.. విధేయత

జీసీ, ఎస్టీ వర్గీయులకు ఎమ్మెల్సీ పదవులు • ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇద్దరికి అవకాశం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కోలా గురువులు

కోలా గురువులు

ఎమ్మెల్యే కోటాలో ఎంపిక చేసిన అభ్యర్థి

మత్స్యకార (వాడబలిజ) సామాజిక వర్గానికి చెందిన గురువులు 2009లో రాజకీయాల్లో ప్రవేశించారు. ప్రజారాజ్యం పార్టీ ద్వారా విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 2012లో వైఎస్సార్‌సీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో పార్టీ తరపున విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయనను రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఇప్పుడు శాసనమండలి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా ప్రకటించి మరోసారి మత్స్యకార సామాజిక వర్గానికి పెద్దపీట వేశారు.

కుంభా రవిబాబు

గవర్నర్ కోటాలో సిఫార్సు చేసిన అభ్యర్థి

ఆంధ్రాయూనివర్సిటీలో 1989 నుంచి 2004 వరకు ప్రొఫెసర్‌గా పనిచేసిన కుంభా రవిబాబు.. దివంగత మహానేత వైఎస్సార్ ప్రోత్సాహంతో రాజకీయాల్లో ప్రవేశించారు. విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజకవర్గం నుంచి 2004లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అసెంబ్లీలో ఎస్టీ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. వైఎస్సార్‌సీపీలో చేరిన అనంతరం 2019లో పార్టీ అరకు పార్లమెంట్ సమన్వయకర్తగా నియమితులయ్యారు. పార్టీ ఎస్టీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఏపీ ఎస్టీ కమిషన్ తొలి చైర్మన్‌గా సేవలందిస్తున్న రవిబాబును గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సిఫార్సు చేశారు.



రవిబాబును అభినందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో బీసీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ఇద్దరిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి పెద్ద మనసు చాటుకున్నారు. ఎమ్మెల్యే కోటాలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులును, గవర్నర్ కోటాలో ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబును పార్టీ అభ్యర్థులుగా ఎంపిక చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వీరిద్దరికీ కీలక నామినేటెడ్ పదవులను అప్పగించిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు ఏకంగా చట్టసభకు ఎంపిక చేసి వారికి మరింత మెరుగైన అవకాశం కల్పించారు. ఆవిర్భావం నుంచి పార్టీ ఎదుగుదలకు నిరంతరం కృషి చేసిన కోలా గురువులును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల మత్స్యకార, వాడబలిజ సామాజిక వర్గీయులు హర్షం తెలుపుతున్నారు. అదే విధంగా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ప్రొఫెసర్ కుంభా రవిబాబును గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా సిఫార్సు చేయడంపై గిరిజనులు, మేధావులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్పందన వినతులు సత్వర పరిష్కారం

- జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్
- 26 మంది నుంచి అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పీవో సూరజ్, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: స్పందనలో స్వీకరించిన వినతులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో కలిసి ఆయనతోపాటు పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు ప్రజలనుంచి 26 వినతులు స్వీకరించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డీఎన్ శాస్త్రి, ఈఈ నాగేశ్వరరావు, వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు, ఏడీఎంహెచ్‌వో అనూష పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- కొయ్యూరు మండలం మఠం భీమవరం గ్రామ సచివాలయ పరిధిలో పోతవరం గ్రామంలో సాగు చేసుకుంటున్న భూములకు సర్వే నిర్వహించి హక్కు పట్టాలు మంజూరు చేయాలని పంగి నరసింహారావు, గొల్లూరి విజయ్, పంగి లీలావతి తదితరులు వినతిపత్రం అందజేశారు.
- అడ్డతీగల గ్రామపంచాయతీ ప్రభుత్వానికి సంబంధించిన భూములను గిరిజనేతరులు ఆక్రమించికుంటున్నారని, వీటికి అడ్డుకట్ట వేయాలని కోరుతూ గిరిజన వర్ధిక సంస్థ, గంగవరం గ్రామానికి చెందిన కుంజం చిన్నారావు అధికారులను కోరారు.
- నేషనల్ హైవే 516ఇ రోడ్డు వెడల్పులో కలిసిపోతున్న రాజవొమ్మంగి మండలం దూసరపాము గ్రామంలో 99 సెంట్ల భూమిని కుటుంబసభ్యులు అందరికీ సమానంగా పంపిణీ చేయాలని కె.రామలక్ష్మి అనే మహిళ వినతి సమర్పించారు.
- పోలవరం ప్రాజెక్టులో కోల్పోతున్న 12 ఎకరాలకు సంబంధించి భూమికి భూమి ఇప్పించాలని టి.సుబ్బారావు అనే వ్యక్తి అధికారులను కోరారు.
- గంగవరం మండలం నెల్లిపూడిలో టి. భరద్వాజ్ కరెంటు షాక్ కారణంగా చేయి కోల్పోయాడని నెల్లిపూడికి చెందిన అతని తల్లి తుపాటి నాగలక్ష్మి వినతి పత్రం అందజేశారు.

సకాలంలో నిత్యావసరాల సరఫరా

జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ ఆదేశం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

రంపచోడవరం: ఏజెన్సీలోని తెల్లరేషన్ కార్డుదారులకు ప్రతినెలా నిత్యావసర సరకులు సకాలంలో సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ఏడు మండలాలకు సంబంధించి జీసీసీ అధికారులు, సీడీపీవోలు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. తెల్లరేషన్ కార్డుదారులు, మధ్యాహ్న భోజన పథకం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలకు సకాలంలో బియ్యం, పంచదార, చోడి పిండి సరఫరా చేయాలని ఆయన ఆదేశించారు. ఏజెన్సీలోని ప్రతి తెల్ల రేషన్ కార్డుదారుడికి ఒకటవ తేదీ నుంచి 17వ తేదీ మధ్యలో నిత్యావసర వస్తువులను ఎండీయూ వాహనాల ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరఫరా చేయాలని సూచించారు. ప్రతినెలా నిత్యావసర వస్తువులు మండల స్థాయి స్టాక్ పాయింట్‌కు ఎప్పటికప్పుడు చేరవేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు చేరవేసి ఆయా సివిల్ సప్లయి డిపోల ద్వారా లబ్ధిదారునికి బియ్యం. గ్రామాల్లో ఎండీయూ వాహనాల ద్వారా సంబంధిత వీఆర్వోల ఆధ్వర్యంలో సరకులు సరఫరా చేయాలన్నారు. ఏజెన్సీలోని ప్రతి సివిల్ సప్లయి డిపోల్లో వచ్చే నెల నుంచి చోడి పిండి పంపిణీకి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఏజెన్సీలోని మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి స్కూళ్లలో వారానికి మూడు రోజుల పాటు రాగి జావతో పాటు 10 గ్రాముల బెల్లం సరఫరా చేస్తామని తెలిపారు. రేషన్ సరఫరాకు సంబంధించి ప్రతి నెలా మండల స్థాయిలో ఒక రోజు సమావేశం ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. తెల్లరేషన్ కార్డుదారులకు సరఫరా చేసే సరకుల ఫొటో, వీడియోలు గ్రూపులో పెట్టాలని సూచించారు. ఎస్‌వో శివప్రసాద్, సివిల్ సప్లయి డీఎం గణేష్‌కుమార్, ఏఎంవో సి.శ్రీహరి, సీడీపీవోలు సంధ్యారాణి, లక్ష్మి, జీసీసీ ఎస్‌ఎంఎంఎస్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పసికందు మృతి ఘటనలో స్టాఫ్‌నర్సు సస్పెన్షన్

ఇద్దరు సెక్యూరిటీ గార్డుల తొలగింపు

మహారాణిపేట: కేజీహెచ్ నుంచి పసికందు మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై తండ్రి తీసుకొని వెళ్లిన ఘటనపై ప్రాథమిక విచారణ చేసిన కమిటీ నివేదికను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌కు అందజేసింది. ఈ మేరకు ఆయన క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆ సమయంలో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్‌నర్సు కృష్ణవేణిని సస్పెండ్ చేశారు. పసికందు మృతదేహాన్ని తరలిస్తున్నప్పుడు గమనించడంలో వైఫల్యం చెందిన సెక్యూరిటీ గార్డు కనకమహాలక్ష్మి, అవుట్ గేట్ సెక్యూరిటీ గార్డు నాగరాజును విధుల నుంచి తొలగించాలని సాయి సెక్యూరిటీ ప్రైవేటు లిమిటెడ్ వారిని ఆదేశించారు. గిరిజన రోగులను మోనటరింగ్ చేయడంలో వైఫల్యం చెందిన ట్రైబుల్ సెల్ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యల కోసం ఐటీడీఏ పీవోకు నివేదికను సమర్పించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. స్టాఫ్ నర్సు నుంచి ట్రైబల్ సెల్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంలో జాప్యం జరగడం, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంలో సమన్వయలోపాన్ని విచారణలో గుర్తించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

- 25 కేంద్రాల్లో థియరీ, 36 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు
- ఓకేషనల్‌కు 17 కేంద్రాలు
- ఇంటర్ బోర్డు ప్రాంతీయ తనిఖీ అధికారి ఉమారాణి

పాడేరు రూరల్: జిల్లాలో వచ్చే నెల 15 నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు జరగనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఇంటర్ బోర్డు ప్రాంతీయ తనిఖీ అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా పరీక్షల షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకొని చదువుకోవాలని సూచించారు. జిల్లాలో ఇంటర్ థియరీ పరీక్షలకు పాడేరు డివిజన్‌లో 15, రంపచోడవరం డివిజన్‌లో 10 కేంద్రాలు, ప్రాక్టికల్ పరీక్షలకు పాడేరు డివిజన్‌లో 16, రంపచోడవరం డివిజన్‌లో 18 కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆమె పేర్కొన్నారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి పాడేరు డివిజన్‌లో 15 కేంద్రాలు, రంపచోడవరంలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆమె వివరించారు. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం సాధారణ కోర్సుల్లో 5,385 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 1149 మంది, రెండో సంవత్సరం సాధారణ కోర్సుల్లో 4,897 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 757 మంది విద్యార్థులు పరీక్షలు హాజరవుతున్నట్టు ఆమె తెలిపారు. బోటనీ, జువాలజీ ప్రాక్టికల్ పరీక్షలకు 1,556 మంది, ఫిజిక్స్, కెమిస్ట్రీ పరీక్షలకు 2,795 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఆమె వివరించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- చింతపండు జీసీసీకి విక్రయిస్తేనే మేలు
- మేనేజర్ దుర్గా ప్రసాద్



అనంతగిరి: గిరి రైతులు దళారులను నమ్మి నమ్మిపోవద్దని, రైతులు చింతపండును జీసీసీకే విక్రయించాలని, జీసీసీ మేనేజర్ దుర్గాప్రసాద్ సూచించారు. డముకు, కాశీపట్నం వారు సంతల్లో దళారుల దందాపై ఈనెల 16న 'సిండికేట్ మాయాజాలం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై జీసీసీ ఉన్నతాధికారులు స్పందించారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ దళారుల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులు నుంచి చింతపండును రూ.32.40కు జీసీసీ కొనుగోలు చేస్తుందన్నారు. తూకాల్లో మోసం ఉండదని, రైతుల సమక్షంలోనే తూకం వేస్తారన్నారు. దళారులు నమ్మి గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారికి అడ్డుకట్టవేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నేరుగా రైతుల ఇళ్లవద్దకే వెళ్లి, చింతపండును జీసీసీ మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని ఆయన వివరించారు. ఇందుకు రైతులు కూడా సహకారం అందించాలన్నారు. జనవరి నెలాఖరు నుంచి ఇప్పటివరకు ఎనిమిది టన్నుల వరకు చింతపండును కొనుగోలు చేశామని చెప్పారు. ఇందులో వారపు సంతలు రెండు రోజుల్లో రెండు టన్నుల వరకు కొనుగోలు చేశామని ఆయన వివరించారు. కరక్కాయ 12 టన్నులు, నల్లజీడి 6.5 టన్నులు కొనుగోలు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. అటవీ ఉత్పత్తులను జీసీసీకి విక్రయించి, రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆయన కోరారు.

గ్రాండ్‌గా గ్రాంటు

- రెండో విడత నిధులు మంజూరు
- ఉమ్మడి విశాఖ జిల్లాకు రూ.2.36 కోట్లు

విశాఖ విద్య: ప్రభుత్వ స్కూళ్ల నిర్వహణకు నిధులు మంజూరయ్యాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 4,944 పాఠశాలలకు రూ.2.36 కోట్లు విడుదల చేస్తూ సమగ్ర శిక్ష డైరెక్టర్ సురేష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వారీగా నిధులు కేటాయింపు చేశారు. వీటిని పాఠశాలల బ్యాంకు ఖాతాలో జమ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అధికారులకు ఆదేశాలు అందాయి. 2022–23 విద్యా సంవత్సరానికి తొలి విడతలో గత ఆగస్టులో ఉమ్మడి విశాఖ జిల్లాలోని 4,090 స్కూళ్లకు రూ.2.24 కోట్లు మంజూరయ్యాయి. సాంకేతిక కారణాలతో తొలివిడతలో కొన్ని పాఠశాలలకు నిధులు జమకాలేదు. ఇలాంటి వాటికి సైతం రెండో విడతలో నిధులు కేటాయింపు చేశారు. రెండో దఫా నిధులు సైతం సకాలంలోనే మంజూరు చేయటం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంజూరైన నిధుల వివరాలు

జిల్లా	పాఠశాలలు	నిధులు (రూ.లక్షల్లో)
విశాఖపట్నం	579	39.22
అనకాపల్లి	1,467	78.47
అల్లూరి	2,898	118.40
మొత్తం	4,944	236.09

పీవీటీజీ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సుమిత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: పీవీటీజీ ఓటర్ల నమోదుపై ప్రత్యేకదృష్టిపెట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, సబ్‌కలెక్టర్లు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఫారం 6బి సేకరణ, భూములు రీసర్వే, ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ, మ్యుటేషన్లు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫారం 6బి పత్రాల సేకరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఫారం 6బి సేకరణలో పాడేరు, ముంచంగిపుట్టు, గూడెం కొత్తవీధి, చింతపల్లి, వై.రామవరం, చింతూరు మండలాల్లో వెనుకబడి ఉన్నాయన్నారు. రానున్న 15రోజుల్లో పురోగతి కనిపించాలని సూచించారు. ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో నకిలీ ఓటర్ల పేర్లను తొలగించాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, ముఖ ఆధారిత హాజరు తప్పనిసరిగా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాసు, పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే, సబ్‌కలెక్టర్ అభిషేక్, డీఆర్వో అంబేద్కర్, సర్వే సహాయ సంచాలకులు మోహనరావు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు సంభవిస్తే చర్యలు

- బాధ్యతగా ఇంటిపన్నుల వసూలు
- తాగునీటి సమస్యపై దృష్టి
- డీఎల్పీవో కుమార్ ఆదేశం



కొయ్యూరు: మాతా శిశు మరణాలు సంభవిస్తే సంబంధిత సిబ్బందితో పాటు వాటికి అనుబంధంగా ఉన్న శాఖల సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎల్పీవో కుమార్ హెచ్చరించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సంక్షేమ సహాయకులు,ఇంజనీరింగ్ సహాయకులు,మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతా శిశు మరణాల నియంత్రణకు ప్రతీ ఒక్కరు కృషి చేయడమే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను తనిఖీ చేయాలని ఆదేశించారు. పౌష్టికాహార పంపిణీని పర్యవేక్షించాలని సూచించారు. పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. పాడైన బోర్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలన్నారు. మార్చి చివరి నాటికి ఇంటిపన్నులను విధిగా వసూలు చేయాలని కోరారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే జీతాలు నిలిపివేస్తామని స్పష్టంచేశారు. ఉపాధి పనుల్లో పాల్గొనే వేతనదారుల సంఖ్య పెంచాలని సూచించారు. ఎంపీడీవో మేరీరోజ్, ఈవోపీఆర్‌డీ ఆర్‌పీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

331 పోలింగ్ కేంద్రాలు..

3.17 లక్షల బ్యాలెట్ పేపర్లు

- ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- ఇప్పటివరకు మూడు నామినేషన్ల దాఖలు
- 2,034 డూప్లికేట్ ఓట్ల తొలగింపు



స్వర్ణభారతి స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం తలమునకలైంది. పోలింగ్ స్టేషన్లు, బ్యాలెట్ పత్రాలు, కోడ్ అమలు మొదలైన అంశాలపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్న అధికారులు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. అలాగే ఇప్పటివరకు మూడు నామినేషన్లు నమోదయ్యాయి. అల్లిపురం ప్రాంతానికి చెందిన కోడి శ్రీనివాసరావు ఇండిపెండెంట్ అభ్యర్థిగా సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 23వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించనున్నారు. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నారు. బీజేపీ మద్దతు అభ్యర్థి మాధవ్ కూడా అదే రోజున నామినేషన్ వేయనున్నారు. టీడీపీ అభ్యర్థి చిరంజీవిరావు నామినేషన్ ఎప్పుడు వేస్తారన్నది ఇంకా ఖరారు కాలేదు.

2,87,258 మంది ఓటర్లు

ఉత్తరాంధ్రలో యాక్సలరీ పోలింగ్ స్టేషన్లతో కలిపి మొత్తం 331 పోలింగ్ కేంద్రాల్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 14వ తేదీ వరకూ మొత్తం 2,87,258 మంది ఓటర్లున్నట్లు జాబితా సిద్ధం చేశారు. వీరికోసం అదనంగా 10 శాతం పత్రాలు, రౌండ్ ఫిగర్‌తో కలిపి మొత్తం 3,17,520 బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. 27వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరు రోజు కావడంతో.. ఆ రోజు సాయంత్రం తర్వాత బరిలో ఎంత మంది అభ్యర్థులున్నారన్నది ఖరారవుతుంది.

డూప్లికేట్ల ఏరివేత

పట్టభద్రుల ఓటర్ల నమోదుకు సంబంధించి పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో జాబితాలోని ప్రతి ఒక్క పేరు, డాక్యుమెంట్లు నిశితంగా పరిశీలించాలంటూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున ఆదేశించిన నేపథ్యంలో డూప్లికేట్ల ఏరివేత ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు 3,871 ఓట్లపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఇందులో 305 సుమోటాగా స్వీకరించారు. ఇందులో ఫారం–7కి సంబంధించి 2,034 ఓట్లు తొలగించారు. ఫారం–8లో 224 ఓట్లను సరిదిద్దారు. ఓటర్ల విషయంలోనే కాకుండా.. ఎన్నికల ప్రవర్తన నియమావళి విషయంలోనూ కట్టుదిట్టంగా వ్యవహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా పరిధిలో 11 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తో పాటు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు సంబంధించి 11 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) బృందాల్ని నియమించారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..

పట్టభద్రుల మండలి ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేస్తున్నట్లు కలెక్టర్ మల్లికార్జున రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. వచ్చే నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో సీఈవో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.మల్లికార్జున మాట్లాడుతూ పూర్తిస్థాయిలో బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. క్లైమ్‌లకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని, డూప్లికేట్ ఓటర్ల తొలగింపు కూడా పూర్తిచేశామన్నారు. సమావేశంలో డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు	సిద్ధం చేయనున్న బ్యాలెట్ పత్రాలు
శ్రీకాకుళం	59	52,196	57,710
విజయనగరం	72	58,382	64,510
పార్వతీపురం మన్యం	24	18,360	20,310
అల్లూరి సీతారామరాజు	15	11,571	12,810
విశాఖపట్నం	112	1,05,235	1,16,290
అనకాపల్లి	49	41,514	45,890
మొత్తం	331	2,87,258	3,17,520

క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం

ఎంపీడీవో సాయి నవీన్

పాడేరు రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, విధిగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఎంపీడీవో కె.సాయినవీన్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం పాడేరు మండల పరిషత్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఎంపీడీవో సాయినవీన్‌తో సహా మరో 11 మంది గ్రామ సచివాలయ, ఇతర ఉద్యోగులు రక్తదానం చేశారు. పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, కార్యదర్శి ఈశ్వరరావు, జిల్లా కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, వైద్యాధికారి రూపకళ, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పల్లాసింగి సూర్యారావు, లోహితాస్, సింహాచలం, మణి, బ్లడ్‌బ్యాంకు సిబ్బంది రాజబాబు, అప్పారావు, సతీష్, వెంకట్ పాల్గొన్నారు.

పెద్దేరులో మహిళ మృతదేహం

మాడుగుల రూరల్/బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద పెద్దేరు నదిలో మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలు కె.జె.పురం గ్రామానికి చెందిన మహిళగా నిర్ధారించారు. పెద్దేరు నదిలో సోమవారం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ కుమారస్వామి తమ సిబ్బందితో వచ్చి మృతదేహాన్ని బయటకు తీయించారు. 50 నుంచి 60 ఏళ్ల వయసు గల మహిళ మృతదేహాన్ని పంచనామా చేసి అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలిసి మృతురాలి కుటుంబీకులు పోలీసులను సంప్రదించగా వివరాలు తెలిసాయి. మృతురాలి పేరు వడ్డాది సావిత్రి. ఆమె కె.జె.పురం 2 వ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తూ 2021 ఆగస్టులో ఉద్యోగ విరమణ చేశారు. ఆమె భర్త ఏడాది క్రితం కరోనా సమయంలో మృతి చెందినట్టు సావిత్రి కుటుంబ సభ్యులు తెలిపారుజ. ఈనెల 19వ తేదీ ఆదివారం మధ్యాహ్నం కె.జె.పురం కాలనీలో ఒక ఫంక్షన్‌లో భోజనం చేసిన తర్వాత ఆమె కనిపించలేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం నుంచి ఆమె ఆచూకీ కోసం తిరిగారు. ఇంతలో గుర్తు తెలియని శవం విజయరామరాజుపేట వద్ద పెద్దేరు నదిలో లభించిందన్న సమాచారం తెలియడంతో వారు బుచ్చెయ్యపేట పోలీసు స్టేషన్‌కు వెళ్లారు.సావిత్రి మృతిచెందినట్టు తెలిసి ఆవేదనకు గురయ్యారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

- ధారమల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు
- పోటెత్తిన భక్తులు
- చీకుధార జలపాతంలో పుణ్యస్నానాలు

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు గ్రామం కిమ్మిలిగెడ్డ అటవీ ప్రాంతంలో ఉన్న కొలువుదీరిన ధారమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శైవక్షేత్రంగా పేరొందిన ఈ ప్రాంతంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇక్కడున్న చీకుధారలో పుణ్యస్నానాలాచరించిన భక్తులు ధారమల్లేశ్వరస్వామి, కాలభైరవుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, దుర్గామ్మలకు పూజలు, అభిషేకాలు చేశారు. కిమ్మిలిగెడ్డ, అమ్మిరేఖల, కొత్తవీధి తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో వంట చేసి, స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు.

పర్యాటక ప్రాంతంగా.. చీకుధార జలపాతం

ఈ ఆలయం సమీపంలో ఉన్న చీకుధార జలపాతం పర్యాటక స్థలంగా పేరొందుతోంది. రాజవొమ్మంగికి సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పర్యటక ప్రాంతం ఇప్పుడిప్పుడే ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రభుత్వం ఇటీవల రూ.5 లక్షలతో ఈ ప్రాంతానికి గ్రావెల్ రోడ్డు సదుపాయం కల్పించడంతో వాహనాలు సరాసరి చీకుధార జలపాతం వద్దకు చేరుకుంటారు. చుట్టు ఎత్తైన పర్వతాలు,



ధారమల్లేశ్వరస్వామికి జలాభిషేకం

పచ్చని చెట్లు, పక్షుల కువకువలు, నిత్యం జలజల పారే స్వచ్ఛమైన నీరు ఈ పర్యటక ప్రాంతానికి మరింత వన్నె తెచ్చాయి. కాకినాడ, రాజమహేంద్రవరం, భీమవరం తదితర సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వచ్చి సేదతీరుతున్నారు. రోజంతా జలకాలాడుతూ ఉల్లాసంగా..ఉత్సాహంగా గడుపుతున్నారు.

పూతిగుంట పరమేశ్వరునికి విశేష పూజలు

వై.రామవరం: మండలంలోని పూతిగుంట పరమేశ్వరుని ఆలయం వద్ద ఈనెల 18 నుంచి ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఇతర జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, హోమాలు, జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఉత్సవాల మూడు రోజులు నిర్వహించిన గిరిజన సంప్రదాయ నృత్యాలు, కోలాటం, భజన తదితర కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అటవీ ప్రాంతంలో ఆలయం, సెలయేరు ఉన్నందున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు ప్రకృతి అందాలను తిలకించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటుచేశారు. కమిటీ సభ్యులు బచ్చలి రమేష్, కలిమెల బాబూరావు సహాయ సహకారాలు అందించారు. గ్రామ సచివాలయ కార్యదర్శి ఎస్‌కే రిజయా, మధుసూదనరాజు, సర్పంచ్ బచ్చలి చిన్నమ్మలు ఆధ్వర్యంలో సిబ్బంది, గ్రామ వలంటీర్లు తాగునీటి వసతి కల్పించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఐ వై.రాంబాబు, ఎస్‌ఐ సంతోష కుమార్, అడిషనల్ ఎస్‌ఐ కె.రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ కె.సుధాకర్ ఉత్సవాలు విజయవంతానికి కృషి చేశారు.



పూతిగుంట పరమేశ్వరుని ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు

గృహ సారథులే.. విజయ వారధులు



గృహసారథులు, కన్వీనర్లకు కిట్‌లను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

పాడేరు రూరల్: పార్టీ ఎంతో నమ్మకంతో నియమించిన గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి 2024 ఎన్నికల్లో పార్టీ విజయానికి కీలక పాత్ర పోషించాలని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఇటీవల నియమితులైన గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లతో సోమవారం పాడేరు మోదకొండమ్మ తల్లి ఆడిటోరియంలో మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు అధ్యక్షతన ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్ల పాత్ర, విధి విధానాలు, అనుసరించాల్సిన విధానాలపై పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి దిశా నిర్దేశం చేశారు. ఏజెన్సీలో గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటా వెళ్లి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను ఎండగట్టాలన్నారు. త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా హాజరైన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో విజయ సోపానాలని,



పాడేరులో శిక్షణ కార్యక్రమానికి హాజరైన గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు

పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకురాలు గిడ్డి ఈశ్వరి చేస్తున్న అసత్య, అర్థరహిత ఆరోపణలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి తన స్వార్థ ప్రయోజనాల కోసం గిరిజనులను మోసం చేస్తూ టీడీపీకి అమ్ముడుపోయిన గిడ్డి ఈశ్వరికి గిరిజనాభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. అనంతరం గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లకు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం కిట్లను అందజేశారు.ఎంపీపీ సొనారి రత్నకుమారి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, మార్కెట్ కమిటీ ప్రతినిధి కూతంగి సూరిబాబు, మాజీ ఎంపీపీలు రమణమూర్తి, మంగ్లన్నదొర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ, ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

- రైతులకు మంచి ఆదాయం పొందేలా చర్యలు
- అసిస్టెంట్ కలెక్టర్ అసితోష్ శ్రీవాస్తవ
- పెదబయలు మార్కెట్‌లో తనిఖీలు

పెదబయలు: జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు పోత్సాహం అందించి రైతులు మంచి ఆదాయం పొందేలా కృషి చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ అసితోష్ శ్రీవాస్తవ సూచించారు.సోమవారం పెదబయలు మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు, వర్తకులతో మాట్లాడారు. పసుపు, పిప్పళ్లు, రాజ్‌మా పంటలకు సంబంధించి మార్కెట్ వివరాలు రైతులు, వ్యాపారులు నుంచి సేకరించారు. పసుపును సరైన ధరతో కొనుగోలు చేయాలని, తూనికల్లో మోసాలకు పాల్పడకుండా స్థానిక రెవెన్యూ ఇతర సిబ్బంది కాటాలు పర్యవేక్షించాలని ఆదేశించారు. తూనిక యంత్రాల్లో తేడాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మార్కెట్లో సదుపాయాలు, వ్యాపారం వివరాలు తెలుసుకున్నారు. పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరారు. అనంతరం స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ,ఉద్యానవన సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆర్గానిక్ కాఫీ సాగు యాజమాన్యం, సస్యరక్షణ తదితర అంశాలపై ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి మరియు సహాయ సంచాలకుడు అశోక్ సూచనలు అందించారు. ఏటా గిరిజన ప్రాంతంలో వెయ్యి ఎకరాల్లో కాఫీ సాగు విస్తరిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అటవీ హక్కు పత్రం (పట్టా) పొందిన ప్రదేశంలో కాఫీ, ఇతర ఉద్యానవన పంటల సాగుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి హార్టికల్చర్ అధికారి జ్యోత్స్నారాణి, రాష్ట్ర అగ్రో డైరెక్టర్ వనల్బ సన్యాసి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఆర్‌ఐ సింహాచలం, వైస్ ఎంపీపీ రాజుబాబు, ఎంపీటీసీ బొంజుబాబు, వీఆర్వో సత్యారావు తదితరులు పాల్గొన్నారు.



పెదబయలు వారపు సంతలో రైతులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ అసితోష్ శ్రీవాస్తవ

అటవీ సిబ్బందిపై విజిలెన్స్ డీఎఫ్‌వో విచారణ

నర్సీపట్నం: ఒకే సామిల్లుకు లోపాకారి ఒప్పందం మేరకు అధికమొత్తంలో అటవీ అధికారులు పర్మిట్లు మంజూరు చేశారని ఒక అజ్ఞాత వ్యక్తి ఏడాది క్రితం సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేశాడు. దీనిపై స్టేట్ విజిలెన్స్ డీఎఫ్‌వో ఎం.రవిశంకర్ శర్మ సోమవారం నర్సీపట్నం అటవీ రేంజ్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. అప్పట్లో ఇక్కడ రేంజర్‌గా పని చేసి ప్రస్తుతం విజయనగరం జిల్లాలో రేంజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బొత్సా అప్పలరాజు, అప్పట్లో పని చేసిన సిబ్బంది సతీష్, నూకరాజును, కరుణ సామిల్లు యజమాని చింతల అప్పలనాయుడుని విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. విజిలెన్స్ డీఎఫ్‌వో మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డి అనే వ్యక్తి కరుణ సామిల్లుకు మాత్రమే కలప రవాణా చేసేలా పరోక్షంగా అధికారులు సహకరించినట్లు ఫిర్యాదులో పేర్కొనడం జరిగిందన్నారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి వివరాలు స్పష్టంగా లేవన్నారు. అయినప్పటికీ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని విచారణ చేపట్టామన్నారు. అనంతరం ప్రస్తుత డీఎఫ్‌వో రాజారావు, రేంజర్ లక్ష్మీనర్సుతో సమావేశమయ్యారు.



స్టేట్ విజిలెన్స్ డీఎఫ్‌వో రవిశంకర్ శర్మ

స్వీట్ దుకాణంపై కేసు నమోదు

అనకాపల్లిటౌన్: బేకరీలు, రహదారులపై తినుబండారాలు ఆరగించే వ్యక్తులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పి.రవికుమార్ అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో స్వీట్ స్టాల్లో వంటకాలకు వాడుతున్న వంటనూనెను ఆయన సోమవారం తనిఖీ చేసి కేసు నమోదు చేశారు. వంటకాలు తయారు చేస్తున్న నూనె నిబంధనల ప్రకారం 25 శాతానికి మించి ఉండకూడదని తెలిపారు.

యూనియన్ బ్యాంక్‌లో స్తంభించిన సేవలు

నెట్‌వర్క్ పనిచేయక ఇబ్బందులు

రాజవొమ్మంగి: స్థానిక యూనియన్ బ్యాంకులో సోమవారం నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. దీంతో మండలం నలుమూలల నుంచి వచ్చిన ఖాతాదారులు దాదాపు రోజంతా వేచి ఉండాల్సి వచ్చింది. సర్వీస్ ప్రొవైడర్ అయిన బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ ఇటీవల తరచూ పనిచేయకపోవడంతో అడ్డతీగల బ్యాంకుకు వెళ్లి లాగిన్ అవుతున్నామని, ఆ తరువాత మాత్రమే నగదు చెల్లింపులు చేయగలుగుతున్నామని మేనేజర్ మహేష్, సబ్ మేనేజర్ లోవరాజు తెలిపారు. ఈ బ్యాంక్ పరిధిలో దాదాపు 1.2 లక్షల మంది ఖాతాదారులు ఉన్నారు. రూ.82 కోట్ల మేర లావాదేవీలు జరుగుతున్నట్టు మేనేజర్ తెలిపారు. నెలవారీగా రూ.1.8 కోట్ల మేర పింఛను సొమ్ము అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దాదాపు 800 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. వీరు పొందిన అప్పులు చెల్లించేందుకు, పొదుపు ఖాతాల్లో సొమ్ము జమ చేసేందుకు దాదాపు ప్రతిరోజూ లోతట్టు గ్రామాల నుంచి ఈ బ్యాంక్‌కు వస్తుంటారు. తరచూ సేవలు స్తంభించడంతో వీరంతా నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ఖాతాదారులు కోరుతున్నారు.



బ్యాంక్ ఎదుట చెట్ల నీడన వేచి ఉన్న ఖాతాదారులు

గల్లంతైన ఇరువురి మృతదేహాలు లభ్యం

ఎటపాక: గోదావరిలో స్నానాలకు దిగి గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు సోమవారం ఉదయం లభ్యమయ్యాయి. ఎటపాక సమీపంలోని మేడువాయి వద్ద గోదావరి నదిలో చేపలు పట్టేందుకు ఆదివారం వెళ్లిన ఆరుగురు యువకులు సరదాగా స్నానాలు చేసేందుకు నదిలో దిగారు. వీరిలో భద్రాచలంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన పాలపర్తి వాసు, అక్బర్ బాషా గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన ప్రాంతంలోనే సోమవారం ఉదయం వారిద్దరి మృతదేహాలను పోలీసులకు లభించాయి. ఈమేరకు కేసు నమోదు చేసి, మృతదేహాలకు పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.





పాలపర్తి వాసు, అక్బర్ బాషా మృతదేహాలు

డబ్బు కోసమే రియల్టర్ కిడ్నాప్

- రౌడీషీటర్ హేమంత్‌కు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లు
- వారితోపాటు మొత్తం 11 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు
- రూ.7.75 లక్షలు, 11 ఫోన్లు, 2 కార్లు స్వాధీనం



మాట్లాడుతున్న సీపీ శ్రీకాంత్

దొండపర్తి (విశాఖ దక్షిణ): సంచలనం సృష్టించిన రియల్టర్ కొప్పోజు మధుసూదనరావు కిడ్నాప్ కేసును పీఎం పాలెం పోలీసులు ఛేదించారు. కిడ్నాపర్ కోలా వెంకట హేమంత్‌కుమార్‌కు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లతోపాటు మొత్తం 11 మందిని సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.7.75 లక్షలు, 2 కార్లు, 11 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ తెలిపారు. పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల రోజుల క్రితం బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన హేమంత్ కుమార్ డబ్బు కోసమే మధుసూధనరావును కిడ్నాప్ చేసినట్లు వెల్లడించారు. అతడి వద్ద నుంచి రూ.11.75 లక్షలు తీసుకోగా... కిడ్నాపర్లలో ఒకరికి డబ్బులు ఇస్తానని చెప్పి, అతడి సహకారంతో కిడ్నాపర్ల చెర నుంచి మధుసూదనరావు తప్పించుకొని ఈ నెల 17వ తేదీన పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేసును ఛేదించినట్లు వివరించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం..

పెద రుషికొండ ప్రాంతానికి చెందిన కొప్పోజు మధుసూదనరావు స్టాక్ ట్రేడింగ్‌తో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడికి 2020లో భీమిలికి చెందిన రౌడీషీటర్ కోలా వెంకటహేమంత్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఇరువురూ కొన్నాళ్లు రియల్ ఎస్టేట్ లావాదేవీలు సాగించారు. హేమంత్‌కుమార్‌పై గతంలో కూడా కిడ్నాప్ కేసు ఉండగా... గంజాయి కేసులో అరెస్ట్ అయి గత నెల 13నే బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చాడు. ఇదిలా ఉంటే మధుసూదనరావుకు చెందిన ఒక విల్లాను ఇటీవల విక్రయానికి పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న హేమంత్‌కుమార్ అతడిని కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకున్నాడు.

జైలులో పరిచయమైన కానిస్టేబుళ్లతో కలిసి..

మధుసూధనరావు కిడ్నాప్ ప్లాన్‌కు ఇద్దరు కానిస్టేబుళ్లు మన్యం జిల్లాకు చెందిన జీరెడ్డి అప్పలనాయుడు, విజయనగరం జిల్లా ఎస్.కోటకు చెందిన కానిస్టేబుల్ బింపోలు రాంబాబు సహకరించారు. వీరిద్దరూ గంజాయి కేసులో అరెస్టయి జైలుకు కూడా వెళ్లి ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు. హేమంత్‌కుమార్ కూడా గంజాయి కేసులో అరెస్టవడంతో జైలులోనే కానిస్టేబుళ్లతో పరిచయం ఏర్పడింది. బయటకు వచ్చాక హేమంత్‌కుమార్ వారితోపాటు దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్న గంధవరపు తరుణ్‌కుమార్(32), మరో ఏడుగురికి మధుసూధనరావు గత నెల 28న పెద రుషికొండలో కిడ్నాప్ ప్లాన్ చెప్పాడు. ఇందులో ఒక్కొక్కరికి రూ.లక్ష ఇస్తానని చెప్పి, అడ్వాన్స్‌గా రూ.5 వేలు చొప్పున ఇచ్చాడు.

విల్లా కొనుగోలుకు పార్టీ ఉందని నమ్మించి...

విల్లా కొనుగోలుకు తన వద్ద పార్టీ ఉందని మధుసూదనరావును హేమంత్‌కుమార్ నమ్మించాడు. 15వ తేదీన పార్టీని కలుద్దామని చెప్పడంతో మధుసూదనరావు ఆ రోజు ఉదయం తన కారులో బాలాజీ బే మౌంట్ రోడ్డుకు వెళ్లాడు. అక్కడ హేమంత్ కుమార్ మరో ఇద్దరు ఎస్.కోటకు చెందిన పాండ్రంకి ప్రసాద్(31), అనకాపల్లికి చెందిన గుడపర్తి చిన్న(19)తో కలిసి కారులో వేచి ఉన్నాడు. అక్కడి నుంచి నలుగురు కారులో బయలుదేరారు.

కాళ్లు.. చేతులు కట్టేసి..

కొంత దూరం వెళ్లేసరికి ప్రసాద్, చిన్న కలిసి మధుసూదనరావు కాళ్లు, చేతులు కట్టేసి అతని వద్ద ఉన్న బంగారం గొలుసు, 2 ఉంగరాలు కాజేశారు. నగర శివారు ప్రాంతంలో ఉన్న ఒక లే అవుట్‌కు తీసుకెళ్లి హేమంత్‌కుమార్ రూ.30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అంత డబ్బు తన వద్ద లేదని, తన ఐసీఐసీఐ బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న రూ.4 లక్షలను హేమంత్ కుమార్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ డబ్బులు సరిపోవని మరో రూ.8 లక్షలు ఇవ్వాలని హేమంత్ డిమాండ్ చేశాడు. దీంతో మధుసూదనరావు ఈ నెల 16న తన భార్య వద్ద ఉన్న బంగారు నగలను తన స్నేహితుడు జగదీష్ ద్వారా బ్యాంకులో తాకట్టుపెట్టి డబ్బులు ఇప్పించాడు. అలాగే మధుసూదనరావు చైన్, ఉంగరాలను ఎస్.కోటలో ఉన్న మణప్పురం, ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రూ.1.8 లక్షలు తీసుకున్నారు.

కిడ్నాపర్లలో ఒకరికి డబ్బు ఇస్తానని బయటపడి..

మధుసూదనరావు డబ్బులు ఇచ్చినప్పటికీ అతడిని కిడ్నాపర్లు విడిచిపెట్టలేదు. హేమంత్ కుమార్‌తోపాటు మరికొంత మంది బయటకు వెళ్తూ మధుసూదనరావుకు కాపలాగా ఒకరిని పెట్టారు. వారు వెళ్లిన వెంటనే కాపాలాగా ఉన్న వ్యక్తికి డబ్బులు ఇస్తానని, తనను పంపించేయాలని కోరడంతో అతడు వదిలేశాడు. దీంతో మధుసూదనరావు వారి చెర నుంచి బయటపడి ఈ నెల 17న పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రత్యేక బృందాల దర్యాప్తుతో 11 మంది అరెస్ట్

మధుసూదనరావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు డీసీపీ – 1 సుమిత్ సునీల్ గరుడ కేసును స్వయంగా పర్యవేక్షించారు. 10 బృందాలను ఏర్పాటు చేసి కిడ్నాపర్ల కోసం గాలించారు. మధుసూదనరావు బ్యాంక్ ఖాతా నుంచి నగదు ట్రాన్స్‌ఫర్ చేసిన ఖాతాల వివరాలు, ఇతర సాంకేతికతతో కిడ్నాపర్లను పోలీసులు గుర్తించారు. అసలు కిడ్నాపర్ హేమంత్‌కుమార్ ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి గోవాకు పారిపోయాడు. పోలీసులు ఒక్కొక్కరిని అదుపులోకి తీసుకొని విచారించగా హేమంత్‌కుమార్‌తోపాటు మొత్తం 11 మంది కిడ్నాప్‌కు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో కోలా హేమంత్‌కుమార్, ఎస్.కోటకు చెందిన పాండ్రంకి ప్రసాద్(31), అనకాపల్లికి చెందిన గుడపర్తి చిన్నా(19), కేడీ పేటకు చెందిన సుర్ల నాగ గణేష్(21), దొండపర్తికి చెందిన దమ్ము శరత్‌తేజ(21), దమ్ము సాగర్ శ్రీనివాస్(22), మన్యం జిల్లాకు చెందిన జెర్రెడ్డి అప్పలనాయుడు, విజయనగరం జిల్లాకు చెందిన బింపోలు రాంబాబు, వడ్లపూడికి చెందిన గంధవరపు తరుణ్‌కుమార్(32), అనకాపల్లికి చెందిన బలిరెడ్డి నానాజీ(25)లను సోమవారం అరెస్ట్ చేశారు. గంధవరపు తరుణ్‌కుమార్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.7.75 లక్షలు, 2 కార్లు, 11 మొబైల్ ఫోన్లు, రెండు జతల పోలీస్ యూనిఫాం స్వాధీనం చేసుకున్నారు. హేమంత్‌కుమార్‌పై ఇప్పటికే 8 కేసులు ఉన్నాయని, అతడిపై పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు తీసుకుంటామని సీపీ శ్రీకాంత్ చెప్పారు. అలాగే కిడ్నాపర్ హేమంత్‌కుమార్‌కు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లు అప్పలనాయుడు, రాంబాబుపై కూడా రెండేసి కేసులు ఉన్నట్లు వివరించారు.

సీపీ శ్రీకాంత్ అభినందన

కిడ్నాప్ కేసును ఛేదించి కిడ్నాపర్లను అరెస్టు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ అభినందించారు. నార్త్ ఏసీపీ సీహెచ్.శ్రీనివాసరావు, పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ, భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి, ఎస్‌ఐలు సీహెచ్.వెంకటరావు, ఎన్.సునీత, ఎ.హర్ష, బి.నరసింహమూర్తి, ఇతర నార్త్ సబ్ డివిజన్ సిబ్బందిని ప్రశంసించారు.



స్వాధీనం చేసుకున్న మొబైల్స్, నగదు